బాబు ష్యూరిటీ..
దిగిపోవడం గ్యారెంటీ


క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

- వైఎస్సార్‌సీపీ కవిటి మండల సమావేశంలో నాయకులు
- ప్రజల తరఫున పోరాడాలని పిలుపు


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

కవిటి: ఆచరణ సాధ్యం కాని సూపర్‌సిక్స్ పథకాలు, అలవి కాని హామీలతో ప్రజలను వంచించి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత తారస్థాయికి చేరిందని జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ అన్నారు. కూటమి ప్రభుత్వం దిగిపోవడం ఖాయమని చెప్పారు. కవిటిలో పార్టీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ అధ్యక్షతన మూడో దశ బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ మండల విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం పటిష్టంగా అమలవుతుండడం ప్రజలు చేసుకున్న దురదృష్టకరమన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో పాటు ఇచ్చిన హామీలు ఏవీ పారదర్శకంగా అమలైన దాఖలాలు లేవని అన్నారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న క్షేత్రస్థాయి ఉద్యోగుల తొలగింపు బాధాకరమన్నారు. కొత్త పింఛన్ల మంజూరు లేదు, ఇంటింటికీ వెళ్లి అందించే రేషన్ విధానాన్ని నిలిపివేశారు, బదిలీ ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు అందించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని విమర్శించారు. గ్యాస్ సిలిండర్ల పేరిట మహిళలను వంచించిన ప్రభుత్వం తల్లికి వందనం పేరిట ఎందరో పేద పిల్లలకు ఈ పథకం అందని ద్రాక్షగా మార్చేశారన్నారు. సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తారస్థాయిలో ఉందన్నారు. విరక్తి చెందిన ప్రజలకు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వారిని కలిసి వారి కష్టాలను తెలుసుకోవడం ద్వారా ప్రజల పక్షాన పోరాడేందుకు ఇది చక్కని అవకాశమన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ప్రజలను కలిసి పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేసిన విధంగా పార్టీ బలోపేతానికి మనమంతా గ్రామాల్లో కలిసి నడవాలన్నారు. పలువురు స్థానిక సంస్థల ప్రతినిధులు నియోజకవర్గ నేతల మధ్య ఐక్యత, కార్యకర్తలకు భరోసా కల్పించకపోతే కష్టమన్నారు. అనంతరం ప్రభుత్వ వైఫల్యాలపై క్యూఆర్ కోడ్ వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. సమావేశంలో ఎంపీపీ కడియాల పద్మ, వైస్ ఎంపీపీలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, పూడి లక్ష్మణరావు, పూడి నీలాచలం, మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ శేఖర్, దేవరాజ్ సాహూ, వై.నీలయ్య, నర్తు శివాజీ పాల్గొన్నారు.


హాజరైన పార్టీ శ్రేణులు

కూటమి పాలన మోసాలమయం

- గొప్పల కోసం అప్పులు
- వైఎస్సార్‌సీపీ సోంపేట మండల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

సోంపేట: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ పాలన మోసాలమయంగా సాగుతుందని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేటలోని చాడేశ్వరి కళ్యాణ మండపంలో మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై మండల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేసి గొప్పలు చెప్పుకుంటుందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి సంవత్సరానికి సుమారు రూ. 79 వేల కోట్లు అవసరం అన్నారు. అయితే ఈ వార్షిక బడ్జెట్‌లో కేవలం 18 వేలు కోట్ల రూపాయలు మాత్రమే హామీల కోసం వెచ్చించడాన్ని చూస్తే ప్రజలను ఎంత మోసం చేశారో అర్థం అవుతుందన్నారు. శాసనసభ సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబే మోసాన్ని ప్రజలకు తెలియజేశారన్నారు. రెడ్ బుక్ పాలన ద్వారా అక్రమ కేసులు పెట్టి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. సంవత్సరం పాలన పూర్తయినా సూపర్‌సిక్స్ హామీల్లో ఎన్ని అమలు చేశారో కూటమి నాయకులకే తెలియాలన్నారు. బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. బాబు హామీలు ష్యూరిటీ మోసం చేయడంతో సంవత్సరం కాలంలోనే ప్రజలు ఎప్పుడు అధికారం దింపుతామనే ఆలోచనకు వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న సుపరిపాలన కార్యక్రమానికి ఆ పార్టీ నాయకులకు అర్థం తెలుసా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సుపరిపాలన ఎక్కడ జరుగుతుందో చెప్పాలన్నారు. తన, మన అనే భేదాలతో పరిపాలిస్తున్న పాలకులు రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ సామన్య ప్రజలను భయాందోళనకు గురి చేస్తూ సుపరిపాలన అంటూ ప్రజల్లోకి వెళ్లడం హాస్యాస్పదంగా ఉందన్నారు.17 మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం చేయడానికి చూస్తున్న చంద్రబాబు ప్రజలకు సుపరిపాలన ఎలా అందిస్తారన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులను కోరారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ మాట్లాడుతూ.. సుపరిపాలన అందించిన ఘనత గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ఇంటివద్దకే సంక్షేమం తెచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబు అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేయడం అలవాటేనన్నారు. పలాసపురం సర్పంచ్ తడక జోగారావు మాట్లాడుతూ.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ప్రతీసారీ ప్రజలను మోసం చేయడమే ఎజెండాగా పెట్టుకుంటారన్నారు. చంద్రబాబు చేసిన మోసాలను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, పార్టీ నాయకులు జక్కం రమేష్, బుద్దాన శ్రీకృష్ణ, ప్రతి అన్వేష్, రౌతు విశ్వనాథం, బతకల మోహనరావు, కోట్ని శ్రీనివాసరావు, అమర లోకనాథం, సిర్మా, గురాల శ్రీను, పాతిన శేషగిరి, బతకల సతీష్, యర్ర రజనీ, కర్రి సత్యం, బట్టి మాధవరావు, తామాడ పద్మావతి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, శ్యాంప్రసాద్ రెడ్డి, నిమ్మన దాస్ తదితరులు


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

కూటమి మోసాలను నిలదీద్దాం

- వైఎస్ జగన్ చేసిన మంచిని, చంద్రబాబు మోసాలను ప్రతీ గడపకూ వివరించాలి
- టెక్కలిలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'సభలో పేరాడ తిలక్

టెక్కలి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మంచిని.. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు చేసిన మోసాలను ప్రతీ గడపకూ వివరించాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు హనుమంతు వెంకటేశ్వరరావు అధ్యక్షతన టెక్కలిలో మండల స్థాయిలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత పంచాయతీ స్థాయి ఇన్‌చార్జిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. బాబూ ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ మండల కన్వీనర్ హెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజావ్యతిరేఖ పాలన కొనసాగిస్తున్నారన్నారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ప్రజలకు అందేవిధంగా మనం పోరాటం చేయాలని కోరారు. వారం రోజులు గ్రామాల్లో పర్యటించి చంద్రబాబు మోసాలను ప్రతీ గడపకు వివరించాలన్నారు. జిల్లా అధికార ప్రతినిధి సత్తారు సత్యం మాట్లాడుతూ.. ఏడాది కూటమి పాలనలో ఒక్కో కుటుంబానికి ఎంత మేలు జరిగిందో కూటమి కార్యకర్తలను నిలదీయాలన్నారు. టెక్కలిలో విలువైన ప్రభుత్వ స్థలాలు, సొసైటీ స్థలాలు ఆక్రమణలు జరుగుతుంటే మంత్రి అచ్చెన్నాయుడు ఏం చేస్తున్నారని ఇందులో వాటాలు కుదిరాయా అని నిలదీశారు. యాదవ సంఘం నాయకుడు గురునాథ్ యాదవ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను పార్టీ శ్రేణులు నిలదీయాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ హెచ్.వెంకటేశ్వరరావు, ఎంపీపీ అట్ల సరోజనమ్మ, వైస్ ఎంపీపీ పి.రమేష్, టి.కిరణ్, వి.శ్రీధర్‌రెడ్డి, పి.హేమలత, డి.ధర్మారావు, పి.రమణబాబు, ఎల్.బాలకృష్ణ, పి.లక్ష్మి, కె.రవికుమార్ గాంధీ, ఆర్.జయమోహన్, ఆర్.మురళీరెడ్డి, కె.అజయ్, బి.కార్తీక్, యు.తమ్మయ్య, జె.తిరుమలరెడ్డి, ఎ.రాహుల్, బి.రాజేష్, కె.జీవన్‌తో పాటు మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.


క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పేరాడ తిలక్ తదితరులు


హాజరైన కార్యకర్తలు

ఎంపీపీ, సర్పంచ్ పదవులపై మంత్రి పెత్తనం



టెక్కలిలో ఎంపీపీ, సర్పంచ్ పదవుల్లో ఉన్నటువంటి దళిత మహిళలపై మంత్రి అచ్చెన్నాయుడు పెత్తనం చెలాయిస్తున్నారు. అడ్డగోలు పనులు చేయాలని ఒత్తిడి చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా తప్పించుకోవడానికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో విశాఖలో రాజధాని ఏర్పాటు అంశంపై వ్యతిరేకంగా మాట్లాడినందుకే అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడుకు మంత్రి పదవులు కట్టబెట్టారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆ తరువాత వైఎస్ జగన్ మాత్రమే శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి సొంత నియోజకవర్గంలో ఎరువులు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. కనీసం పండిన ధాన్యం అమ్ముకోలేని దుస్థితికి అన్నదాతలను తీసుకొచ్చారు. నియోజకవర్గంలో మంత్రి తన సోదరుడు హరిప్రసాద్‌తో లిక్కర్ మాఫీయా చేయిస్తూ ఈ రోజు గత ప్రభుత్వంలో లిక్కర్ స్కాం జరిగిందంటూ రంకెలేస్తున్నారు. కూటమి నాయకులు తప్పులను ప్రశ్నిస్తుంటే, పోలీస్‌స్టేషన్‌కు పిలిపిస్తూ బెదిరిస్తున్నారు. సూపర్‌సిక్స్‌తో పాటు 143 హామీలు ఎప్పుడిస్తారని ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి గ్రామాల్లో బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి.

–పేరాడ తిలక్, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి

తప్పు చేశామని ప్రజలు బాధ పడుతున్నారు



కూటమి పార్టీలకు అధికారం ఇచ్చి తప్పు చేశామని ప్రజలు బాధ పడుతున్నారు. కూటమి ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులతో ప్రస్తుతం రేషన్ బియ్యం కోసం ప్రజలు పడుతున్న కష్టాలు నాయకులకు కనిపించడం లేదా. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ కార్యకర్తలకే లబ్ధి చేయాలని చూస్తున్నారు తప్పా ప్రజలకు మంచి చేయడం లేదు. దశాబ్దాలుగా పాలిస్తున్న కింజరాపు కుటుంబం జిల్లాకు ఏం చేశారో చెప్పాలి.

– దువ్వాడ వాణి, టెక్కలి జెడ్పీటీసీ సభ్యురాలు

కక్ష కట్టి చెక్ పవర్ రద్దు చేశారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళిత మహిళనైన తనపై కక్ష కట్టి ఇబ్బందులకు గురి చేసి చివరకు చెక్ పవర్ రద్దు చేశారు. నాలుగు సమావేశాలకు సంబంధించి మినిట్ బుక్‌లపై సంతకాలు పెట్టించుకుని అన్యాయంగా చెక్ పవర్ రద్దు చేశారు. ఎంతో మంది కుటుంబాలను ఇబ్బందులకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలకు వివరించాలి.

– గొండేల సుజాత, టెక్కలి మేజర్ పంచాయతీ సర్పంచ్

క్లుప్తంగా

నేడు కోటబొమ్మాళిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం

టెక్కలి: కోటబొమ్మాళి మండలంలో సోమవారం నుంచి బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సంపతిరావు హేమసుందర్‌రాజు ఆదివారం తెలిపారు. జియ్యన్నపేట, చిన్నసాన, రామేశ్వరం పంచాయతీల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కాశీబుగ్గ: పలాస జీఆర్పీ పరిధి జాడుపూడి–సోంపేట రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. జీఆర్పీ స్టేషన్ ఏఎస్సై మెట్ట సోమేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 55 ఏళ్ల వ్యక్తి గుర్తు తెలియని రైలు కిందపడి మృతి చెంది ఉండవచ్చునని చెప్పారు. పలాస జీఆర్పీ ఎస్సై షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సోంపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

కాశీబుగ్గ: స్థానిక లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నికైంది. ఎస్ఎంసీ ఫంక్షన్ హాల్‌లో 'ది ఇంటర్ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్ క్లబ్స్' ఎన్నికలు జరిగాయి. పలాస లయన్స్ క్లబ్ క్యాష్యు ప్రెసిడెంట్‌గా అట్టాడ మాధవరావు, పలాస–కాశీబుగ్గ ప్రెసిడెంట్‌గా ఎస్.మధుసూదనరావు, పాలబుగ్గ ప్రెసిడెంట్‌గా బి.తరుణ్ కుమార్, వనిత విభాగం ప్రెసిడెంట్‌గా టి.స్వేతాకుమారిని ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

సర్వీసు రోడ్డుపై వ్యాపారం!

- ట్రాఫిక్‌కు అంతరాయం


సర్వీసు రోడ్డుపై అరటి గెలలను ఉంచిన వ్యాపారులు

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామం వద్ద ఆదివారం సంత కూడలిలో జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీసు రోడ్డును కొంతమంది తమ ఆధీనంలోకి తీసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. ప్రధానంగా అరటి గెలల వ్యాపారులు వాహనాలను పెట్టి రోడ్డును ఆక్రమించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తుతోంది. ప్రతీ ఆదివారం ఇక్కడ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఆ రోడ్డు మార్గంలో కేసరపడ, ఎక్కల, భైరిపురం, డి.జి.పురం పంచాయతీ గ్రామాలతోపాటు సమీప ఒడిశా గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. ఆదివారం వస్తే ఈ రోడ్డు మార్గం వాహనాలను నిలిపేసి వ్యాపార లావాదేవీలు చేయడంతో ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ఎటువైపు నుంచి రాకపోకలు చేయాలో అర్థం కాని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీనిపై స్థానిక పోలీస్ యంత్రాంగం దృష్టిసారించి నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి


అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కంచిలి: దశాబ్దాలుగా పేదలు సాగుచేసుకొని జీవిస్తున్న భూములకు ప్రభుత్వం పట్టాలివ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాలిన నారాయణ స్వామి డిమాండ్ చేశారు. శాసనాం గ్రామంలో స్థానిక సీపీఐ నేత జన్ని సోమేష్ అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అమర వీరులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దివంగత నేత జాజిమొగ్గల తరిణి అమరవీర స్థూపం నిర్మాణం చేపట్టాలని, దివంగత తరిణి, పొందర దామోదర్, దొండపాటి చంద్రశేఖర్‌ల పోరాట స్ఫూర్తితో ముందుకు పోవాలని కోరారు. మరో నేత అరేలమ్మ మాట్లాడుతూ.. ఒంగోలులో ఆగస్టు 20 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర మహాసభల జయప్రదానికి కృషి చేయాలని కోరారు. పార్టీ సభ్యులు వసంత కుమార్, వెంకటస్వామి, పార్వతి, లోకనాథం పాల్గొన్నారు.

మత్తుకు చిత్తు కావద్దు

ఇచ్ఛాపురం రూరల్: యువకులు మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని చిత్తు చేసుకోవద్దని ఇచ్ఛాపురం రూరల్ ఎస్సై సి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎం.తోటూరు మూడు రోడ్ల కూడలిలో యువకులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించి పూర్తి పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

అ'పూర్వ' కలయిక


ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1977–78 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు భోగాపురం సమీపంలోని ఓ రిసార్ట్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సుమారు 47 ఏళ్ల అనంతరం కుటుంబాలతో కలుసుకొని ఆనందంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో సంతోషంగా గడిపి కుటుంబ సమాచారాన్ని పంచుకున్నారు. తోటి స్నేహితులు ఎవరైనా ఆపదలో ఉంటే వారిని ఆదుకునేందుకు నిర్ణయించుకున్నారు. వచ్చే ఏడాది కాశీబుగ్గ హైస్కూల్‌లోనే కలుసుకునేందుకు నిర్ణయించుకున్నారు. సుధారాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్వీ కృష్ణ, ఎ.శ్రీనివాసరావు, చాపర సుందర్ లాల్, ఆరిపాక జనార్దన, ఉప్పాడ సుధాకర్, శాసనపురి గణపతి, ఎంపీ శ్రీనివాసరావు, డి.మహారణ, సుజాత, శాంతి, రమణమ్మ, నిర్మల, రాజ్యం, హైమ, ఆనందమోహన్, ఉమా శంకర్, హరినాథ్, వాసు, తాళాసు ఆనందరావు, అంబిక, ఝాన్సీ, బద్రి కూర్మారావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ మూడో వార్డు జయరామచంద్రపురం గ్రామ సమీపంలో రైలు నుంచి జారిపడి యువకుడు గాయపడ్డారు. ఒడిశా రాష్ట్రం బరంపురం పట్టణానికి చెందిన యువకుడు అలోక్ రంజన్ జయరామ చంద్రపురం గ్రామ సమీపానికి రైలు రావడంతో ఫుట్‌పాత్ ప్రయాణం చేస్తూ జారి పడిపోవడంతో గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పలాస 108 వాహనం సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడ్ని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. జీఆర్పీ సిబ్బంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ


పిల్లలకు విద్యా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో టీమ్ తారక్ సభ్యులంతా ఆదివారం టెక్కలిలో పలువురు నిరుపేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, స్టేషనరి సామగ్రిని అందజేశారు. టీమ్ తారక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా నిరుపేద విద్యార్థులకు సాయం చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్ డి.భాస్కర్ తెలిపారు.

అచ్చెన్నా.. ఎరువులు ఎక్కడ?

- రైతులను నిలువునా ముంచిన కూటమి ప్రభుత్వం


మాట్లాడుతున్న శ్రీరామమూర్తి

నందిగాం: అభివృద్ధి, రైతుల సంక్షేమం అంటూ నిత్యం ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జూలై నెలాఖరు వస్తున్నా రైతులకు ఎరువులు ఎందుకు అందజేయలేకపోతున్నారో చెప్పాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి ప్రశ్నించారు. నందిగాంలో విలేకర్లతో ఆదివారం మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులంతా ఎరువుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అయితే ఈ నియోజకవర్గ ఎమ్మెల్యేగా, వ్యవసాయశాఖ మంత్రిగా ఉంటూ కనీసం రైతులకు అవసరమయ్యే ఎరువులు అందేలా చూడకపోవడం సిగ్గుచేటన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా మే, జూన్ నెలల్లోనే ఎరువులు అందజేసేవారని, మరి ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎందుకు ఎరువులను సరఫరా చేయలేకపోతుందో చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం ఎరువులు సరఫరా చేయకపోవడంతో రైతులంతా ప్రైవేటు డీలర్లను ఆశ్రయిస్తూ అధిక ధరలకు కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఇదే అదునుగా టెక్కలి నియోజకవర్గంలోని టీడీపీ మద్దతుదారులైన ఎరువుల వ్యాపారస్తులు డీఏపీ, యూరియాలను అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను నిలువునా మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. అలాగే డీఏపీ కావాలని ప్రైవేటు డీలర్ల వద్దకు వెళ్తుంటే డీఏపీతోపాటు పురుగు, క్రిమిసంహారక మందులు కొనక తప్పదని చెప్పి అధిక ధరలకు వాటిని అంటకడుతూ తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. టీడీపీకి అనుకూలంగా ఉన్న ప్రైవేటు డీలర్లకు లబ్ధి చేకూర్చేందుకే సకాలంలో ఎరువులు అందజేయడం లేదని ఆరోపించారు. రైతులకు మేలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ఏడాది ఖరీఫ్, రబీలో పండించిన పంటలకు సరైన ధర కల్పించకపోవడంతో రైతులు అమ్ముకోలేని స్థితికి తీసుకువచ్చారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో విత్తనాలు, ఎరువులు అందజేయకుండా రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ మంత్రి నియోజకవర్గంలోనే ఎరువులు అందజేయడం లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా రైతుల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ ప్రారంభంలోనే రైతు భరోసా కింద పంట పెట్టుబడి సాయం అందజేసేవారన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే అన్నదాత సుఖీభవ పేరున పంట పెట్టుబడి ఇస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చాక గత ఏడాది ఎగ్గొట్టారని, ఈ ఏడాది ఇస్తామంటూనే కాలయాపన చేస్తూ లబ్ధిదారుల సంఖ్య తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే రైతులకు కావాల్సిన ఎరువులు అందజేసేలా చర్యలు తీసుకోవాలని.. లేదంటే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి


మాట్లాడుతున్న బాబూరావు

మందస: ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. యూటీఎఫ్ మందస మండల స్థాయి విస్తృత కార్యవర్గం సమావేశం మండల అధ్యక్షులు జగదీష్ బడిత్య అధ్యక్షతన ఒడియా టీచర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలైన మెగా పీటీఎం, యోగా, స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాలను అప్పగిస్తూ ఒత్తిడికి గురి చేయడం తగదన్నారు. వేరే కార్యక్రమాలు అప్పగించడంతో విద్యార్థులు బోధన అభ్యాసనకు దూరమవుతున్నారన్నారు. సమావేశంలో జిల్లా పూర్వపు కార్యదర్శి రాజాన పరమేశ్వరరావు, జిల్లా అకాడమి సెల్ కో కన్వీనర్ కంచరాన మాధవరావు, మండల సహ అధ్యక్షులు ప్రియాంక మహారాణా, గంట గోపాలకృష్ణ, పిన్నింటి కోండలరావు, జిల్లా కౌన్సిలర్లు ధర్మాన కిరణ్, లావేటి జానకీరావు, అరుణ్ కుమార్ పాడి, ప్రవీణ్ ప్రధానో, కాసం శ్రీనావాస్ ఉన్నారు.